

153 వ భాగం

భాగవతం మొదలు, వ్యాసచింత – 1

మనకు తెలిసినంతలో భాగవతం సూతుడు శౌనకాది మునులకి చెప్పినట్టుగా, ఆ చెప్పడం కూడా శుకమహర్షి పరీక్షిత్తుతో చెప్పినట్టు మొదలౌతుంది. కానీ రాసినది మాత్రం వ్యాసుడు కదా? అయితే వేదాలని నాలుగు భాగాలుగా విడగొట్టి భారతం రాసిన వ్యాసుడు భాగవతం ఎందుకు రాసాడు? దానికి ఏమిటి ప్రేరణ? దీనికి సమాధానం భాగవతం మొదటి స్కంధంలో దొరుకుతుంది. సూతుడు చెప్తున్నాడు మునులతో.

వ. అని యడిగిన, శౌనకాది మునిశ్రేష్ఠులకు సూతుం డిట్లనియెఁ"దృతీయం బైన ద్వాపరయుగంబు దీఱు సమయంబున నుపరిచరవసువు వీర్యంబున జన్మించి, వాసవి నాఁ దగు సత్యవతి యందుఁ బరాశరునికి హరికళం జేసి, విజ్ఞాని యయిన వేదవ్యాసుండు జన్మించి యొక్కనాఁడు బదరికాశ్రమంబున సరస్వతీనదీ జలంబుల స్నానాది కర్మంబులం దీర్చి శుచియై, పరులు లేని చోట నొంటిఁ గూర్చుండి సూర్యోదయవేళ నతీతానాగతవర్తమానజ్ఞుం డయిన యా ఋషి వ్యక్తంబు గాని వేగంబుగల కాలంబునం జేసి యుగధర్మంబులకు భువి సాంకర్యంబు వొందు; యుగయుగంబుల భౌతిక శరీరంబు లకు శక్తి సన్నంబగుఁ బురుషులు నిస్సత్త్వులు, ధైర్యశూన్యులు, మందప్రజ్ఞు, లల్పాయువులు, దుర్బలులు, నయ్యెద రని, తన దివ్యదృష్టిం జూచి, సర్వవర్ణాశ్రమంబులకు హితంబు సేయం దలంచి, నలుగురు హోతలచేత ననుష్ఠింపందగి ప్రజలకు శుద్ధికరంబు లైన వైదిక కర్మంబులగు, యజ్ఞంబు లెడతెగకుండు కొఱకు నేకంబయిన వేదంబు, ఋగ్యజుస్సామాథర్వణంబులను నాలుఁగు నామంబుల విభాగించి, యితిహాస పురాణంబు లన్నియుఁ బంచమవేదం బని పల్కె నందు.

[1-82]

ద్వాపరయుగం చివరిలో (తీరు సమయంబున) పరాశర మహర్షికి సత్యవతి వల్ల వ్యాసుడు పుట్టాడు. బదరికాశ్రమంలో కూర్చున్నప్పుడు ఆలోచించాడు – రాబోయే యుగంలో ధర్మం కళ తప్పుతుంది. శరీర ధారుఢ్యం మానవులకి అంత ఉపయోగించదు (నిస్సత్వులు), ఆయుష్షు తక్కువ, చేతకానివారు (దుర్బలులు) అవుతారని

గ్రహించాడు. ఇవన్నీ ఆయనకి ఎలా తెలిసాయి? ఆయన భూత భవిష్యత్ వర్తమానాలు తెల్సినవాడు కనక (నతీతానాగతవర్తమానజ్ఞుం డయిన యా ఋషి). ఒకసారి ఆత్మ సాక్షాత్కారం కలిగే అన్నీ తెలుస్తాయనేది విజ్ఞులమాట. అందుకే ఆ స్థితిని శివానందులు అంటారు – ఏది తెలిస్తే ఇంకేమీ తెలియనక్కర్లేదో, ఏది తెలిస్తే అన్నీ తెలుస్తాయో అదే ఆత్మ సాక్షాత్కారపు స్థితి. అలా అన్నీ గ్రహించాడు కనక వేదాలని – ఋగ్, యజుర్, సామ, అధర్వణ అని నాలుగు భాగాలుగా విభజించాడు. ఇతిహాస, అష్టాదశ పురాణాలని పంచమ వేదం అని పేరు ఇచ్చాడు. మహాభారతం కూడా ఈ పంచమ వేదంలోకే వచ్చేది. తన శిష్యులకి ఇవన్నీ ఇచ్చి అన్ని మూలలకీ వెళ్ళి వీటిని వ్యాప్తి చేయండి అన్నాడు. ఎవరికేమి ఇచ్చాడో తర్వాతి పద్యంలో.

సీ. పైలుండు ఋగ్వేద పఠనంబు దొరఁకొనె,
సామంబు జైమిని సదువుచుండె,
యజువు వైశంపాయనాఖ్యుండు గైకొనెఁ,
దుది నథర్వము సుమంతుఁడు పఠించె,
నఖిల పురాణేతిహాసముల్ మా తండ్రి
రోమహర్షణుఁడు నిరూఢిఁ దాల్చెఁ,
దమతమ వేద మా తపసులు భాగించి
శిష్యసంఘములకుఁ జెప్పి రంత [1-83]

తే. శిష్యు లెల్లను నాత్మీయశిష్యజనుల
కంత బహుమార్గములు సెప్పి యనుమతింపఁ
బెక్కుశాఖలు గలిగి యీ పృథివిలోన
నిగమ మొప్పారె భూసుర నివహమందు. [1-83.1]

పైలుడు ఋగ్వేదం, జైమిని సామవేదం, వైశంపాయనుడు యజుర్వేదం, సుమంతుడు అధర్వణ వేదం చదువుకున్నారు. సూతుడి తండ్రి రోమహర్షణుడు నిష్టగా నేర్చుకున్నారు. ఒక్కొక్క వేదంలో భాగాలు ఉన్నట్టే యజుర్వేదం శుక్ల యజుర్వేదం అనీ, కృష్ణ యజుర్వేదం అనీ రెండు భాగాలు. నిత్యం శివాలయంలో పఠించే నమక చమకాలు ఈ కృష్ణ యజుర్వేదంలోనివే. అలాగే భాగవతంలో వచ్చే ధ్రువుడి కథలో విష్ణువు తన శంఖం ధ్రువుడి చెంపకి ఆనించగానే ధ్రువుడి నోట్లోంచి వచ్చిన గానం సామవేదం – అది విష్ణువుకి బాగా ఇష్టమైనది కనక. ఈ

నాలుగు వేదాలూ భగవంతుడి నోట్లోంచి వచ్చినవే కనక అవి ఉండేది కూడా ఆయన శంఖంలోనే అని విష్ణువు గూర్చి కథ. పై సీస పద్యంలో నిష్టగా నేర్చుకున్నారు అన్నారు. నిరూఢి అంటే నిష్టగా.

అలా వేదాలని శిష్యులకి ఇచ్చి మిగతావారికి ఇవ్వమనీ వాటిని బాగా ప్రాచుర్యం చేయమనీ చెప్పాక అవి అనేక శాఖలుగా విస్తరించాయి. ఇంత చేసాక కూడా మనసులో శాంతి మాత్రం లేదు. దీనికేమిటి కారణం అంటూ ఆలోచించాడు వ్యాసుడు.

సీ. వ్రతధారినై వేదవహ్ని గురుశ్రేణి–
మన్నింతు, విహితకర్మములఁ గొఱఁత
పడకుండ నడుపుదు, భారతమిషమునఁ–
బలికితి వేదార్థభావ మెల్ల,
మునుకొని స్త్రీశూద్రముఖ్యధర్మము లందుఁ–
దెలిపితి నేఁజెల్ల, దీనఁ జేసి
యాత్మ సంతస మంద, దాత్మలో నీశుండు–
సంతసింపక యున్న జాడ దోఁచె, [1-85]

ఆ. హరికి యోగివరుల కఖిలషితంబైన
భాగవత విధంబుఁ బలుకనైతి,
మోసమయ్యెఁ దెలివి మొనయదు, మఱచితి
ననుచు వగచుచున్న యవసరమున. [1-85-1]

వేదాలని విభజించాను. గురువులని గౌరవించాను. రోజువారీ చేయాల్సిన కర్మలన్నీ తప్పకుండా చేస్తున్నాను, మహాభారతం పేరుతో వేదార్థం అంతా పంచమవేదంలా పలికాను. అయితే మనసులో ఏదో చింత; సంతోషం లేదు. కారణం చూడబోతే హరి భక్తులకీ, యోగులందరికీ ఉత్సాహం కలిగించే మహాభాగవతం మాత్రం చెప్పడం మరిచిపోయాను. అలా తెలివిగా ఆలోచించక మోసపోయాను (మోసమయ్యెఁ దెలివి మొనయదు) అని కలతపడుతున్నాడు.

సరిగ్గా గమనించారా? భగవంతుడు కనపడాలంటే ముందు ఆయనమీద భక్తి ముఖ్యం. అది లేకుండా మిగతావి ఎన్ని ఉన్నా మనసు వ్యాకులతతో ఉంటుంది. ఈ భక్తి అంటే ఇష్టం, నాకు భగవంతుడు తప్ప మరేకీ వద్దు అనుకోవడం. దీన్నే బుద్ధుడు తపస్సు చివరిలో అనుకోవడం చూడవచ్చు[“ఇహాసనే శుష్యతు మే శరీరం, త్వగస్థి మాంసం ప్రళయం చ యాతు, అప్రాప్య బోధిం బహుకల్ప దుర్లభాం నైవాసనాత్కాయమతశ్చలిష్యతే – నా శరీరం శుష్కించిపోయి, చర్మం, మాంసం, ఎముకలు మట్టిలో కలిసిపోనీయి గాక, అనేకానేక కల్పాలు కష్టపడినా అందుకోలేని దుర్లభమైన బోధిని పొందకుండా ఈ ఆసనం మీదనుంచి లేచేది లేదు”] దేనినే స్వామి వివేకానందులు అంటారు – “వేటకి వెళ్ళాలనుకునేవారు వెళ్ళి సింహాలని, ఖడ్గమృగాలనీ వేటాడతారు దొంగతనం చేయాలనుకునేవారు రాజుగారి ఖజానా కొల్లగొట్టాలి అనుకుంటారు. చీమలని వేటాడటం, ముష్టి ఎత్తేవారి దగ్గిర దొంగతనం ఎందుకూ పనికిరావు. అలాగే మీరు ఎవరినైనా ప్రేమించాలనుకుంటే అఖండ ప్రేమస్వరూపుడైన భగవంతుణ్ణి ప్రేమించండి.” అలా మనసులో ఒకసారి భక్తి కలిగితే ఇంకేమీ అవసరం లేదు. అటువంటి భక్తి రావాలంటే భగవంతుడి లీలలు వింటూ ఉండాలి కదా? ఆ లీలలు వివరించే భాగవతం మాత్రం మర్చిపోయాడు వ్యాసుడు. అందుకే మనసులో సంతోషం అనేది లేదు. ఇలా కలవరపడుతుంటే నారద మహర్షి వచ్చాడు ఆయన్ని చూడ్డానికి.

సీ. తన చేతి వల్లకీతంత్రీ స్వనంబున–
సతత నారాయణశబ్ద మొప్ప,
నానన సంభూత హరిగీతరవ సుధా–
ధారల యోగీంద్రతతులు సొక్కఁ,
గపిల జటాభార కాంతిపుంజంబుల–
దిశలు ప్రభాత దీధితి వహింపఁ,
దనులగ్న తులసికా దామగంధంబులు–
గగనాంతరాళంబు గప్పికొనఁగ, [1-86]

ఆ. వచ్చె మింటనుండి వాసవీనందను
కడకు మాటలాడఁ గడఁకతోడ,
భద్రవిమలకీర్తిపారగుఁ, డారూఢ
నయవిశారదుండు, నారదుండు. [1-86-1]

నారదుడంటే తొలి గురువు. ధ్రువుడి దగ్గిర్నుంచి అనేకమందికి దీక్ష ఇచ్చి ఆత్మ సాక్షాత్కారానికి దారి చూపించినవాడు. చేతిలో ఉన్న వీణ మీటుతూ (చేతి వల్లకీతంత్రీ స్వనంబున. వల్లకి – వీణ), నిరంతరం నారాయణ శబ్దం చేస్తూ (సతత నారాయణశబ్ద మొప్ప), ఆయన నోట వచ్చే హరి గీతం మూలాన యోగులందరూ పరవశం అవుతూ ఉంటారుట (సంభూత హరిగీతరవ సుధాధారల యోగీంద్రతతులు సొక్క), జుట్టులోంచి కాంతిపుంజాలు వస్తూ ఉంటాయి. వచ్చేటప్పుడు తులసి సుగంధాలు వెలువరుస్తూ (తులసికా దామగంధంబులు) నారదుడు వచ్చాడు వ్యాసుడి దగ్గిరకి. ఈ నిరంతరం నార్యాయణ శబ్దం ఎలా వస్తుంది నార్దుడంతటి యోగులకి అనేదానికి రామకృష్ణ పరమహంస చెప్తారు సమాధానం – యోగులు అభ్యాసంలో ఒక స్థితి దాటాక భగవంతుడి పేరు తప్ప మరేదీ వినాలనుకోరు. అదే కదా ముందు చెప్పుకున్న నిరంతర భక్తి అనేది. ఆ భక్తి మీద గ్రంధమే భాగవతం.

క. కనియెన్ నారదుఁ డంతన్
వినయైక విలాసు, నిగమ విభజన విద్యా
జనితోల్లాసున్, భవదుః
ఖనిరాసున్, గురుమనోవికాసున్, వ్యాసున్. [1-87]

వ. ఇట్లు నిజాశ్రమంబునకు వచ్చిన నారదు నెఱింగి లేచి వ్యాసుండు విధివత్ క్రమంబునం బూజించిన, నతండు లేనగవు నెగడెడి మొగంబుతోడ విపంచికా తంత్రి వ్రేల మీటుచు నిట్లనియె. [1-88]

ఇలా వచ్చిన నారదుణ్ణి వ్యాసుడు చూసి లేచి పూజించాడు. ఈ కంద పద్యంలో వ్యాసుణ్ణి పోతన ఏమన్నాడో చూడండి – వినయంతో ఉండే నడవడిక కలవాడు (వినయైక విలాసున్), వేదాలని విభజించినవాడు (నిగమ విభజన విద్యా జనితోల్లాసున్; నిగమము – వేదం), సంసారంలో ఉండే దుఃఖాలని నివారించిన వాడు (భవదుఃఖనిరాసున్), అధికంగా మనసు వికసించినవాడు (గురుమనోవికాసున్; గురు – అధికంగా). నారదుడు వ్యాసుణ్ణి చూసి వీణ మీటుతూ అడుగుతున్నాడు. అంటే అవతల ఎవరితోనో మాట్లాడుతున్నా మనసులో హరి, నారాయణ అనేవి వదలకుండా జపిస్తూనే ఉన్నాడు. అందుకే ఆయన భువనాలకి తొలి గురువు.

ఉ. ధాతవు, భారతశ్రుతివిధాతవు, వేదపదార్థజ్ఞాతవి
జ్ఞాతవు, కామముఖ్యరిపుషట్కవిజేతవు, బ్రహ్మతత్త్వని
ర్ణేతవు, యోగినేతవు, వినీతుఁడ వీవు చలించి చెల్లరే!
కాతరుకైవడిన్ వగవఁ గారణ మేమి? పరాశరాత్మజా! [1-89]

నువ్వు బ్రహ్మదేవుడివి (ధాతవు), మహాభారతం అనే పంచమ వేదం (భారతశ్రుతివిధాతవు) రాసావు కదా? కామం అనే అరిషడ్వర్గాలని జయించినవాడివి (కామముఖ్యరిపుషట్కవిజేతవు), బ్రహ్మాన్ని తెల్సుకున్నవాడివి (బ్రహ్మతత్త్వనిర్ణేతవు), యోగులకి నాయకుడు అనిపించుకున్నవాడివి (యోగినేతవు). అయినా మనసు ఎలా చలించింది ఈ విషయంలో? అతి పిరికివాడిగా ఇలా విలపించడానికి కారణమేమిటి? ఈ పద్యంలో పిరికివాడు అనేది ఎక్కడుందో చెప్పండి చూద్దాం? కాతరుడు – పిరికివాడు. దీనికి వ్యాసుడి సమాధానం వచ్చే నెల వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS